సాక్షి మంచిర్యాల

సోమవారం । 10 । జూలై । 2023



మేమున్నాం..
ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చే వారికి మెంటల్ హెల్త్ క్లినిక్‌లు అభయాన్ని ఇస్తున్నాయి. అన్ని జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో వీటిని ప్రారంభించారు. 8లో▸



అప్రకటిత కోతలు.. ప్రజల అవస్థలు
భీమారం మండల కేంద్రంలో అనధికార విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా గంటల కొద్ది విద్యుత్ తొలగిస్తున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.2 /27.4

వాతావరణం
ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగతాయి. ఉక్కపోతగా ఉంటుంది. సాయంత్రం ఒకటిరెండు చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గూడెంలో జడ్జి పూజలు



జడ్జి దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు, సిబ్బంది

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామిని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి ప్రభాకర్‌రావు దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. సత్యదేవున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన తర్వాత అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందించారు.

ముగిసిన రాజశ్యామల యాగం



యాగంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాబుక్యాంపు బస్తీలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి కళ్యాణ మండపంలో భజన సంఘం ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాజశ్యామల యాగం ఆదివారం ముగిసింది. చివరి రోజు ఆర్యవైశ్య కుటుంబాలతోపాటు ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు సుఖ శాంతులతో ఉండాలని పూజలు చేశారు. యాగంలో పాల్గొన్న దంపతులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జన సంఘం నిర్వాహకులు, ఆర్యవైశ్య సంఘం ముఖ్య నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బీజీఐ మాన్యుఫాక్చర్స్ ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజీఐ మాన్యుఫాక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ ఆదివారం ప్రారంభించారు. కొత్తగా ఏర్పాటుచేసిన ఈ యూనిట్ ద్వారా రూఫ్‌షీట్స్, హెడ్స్‌క్వెడ్, లింక్‌మెష్, వైల్డ్‌మెష్‌లు తయారు చేస్తామని బీజీఐ మేనేజింగ్ డైరెక్టర్ ఊరగొండ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి సప్లయర్ సీహెచ్. మల్లేశ్, డైరెక్టర్లు రాజ్‌కుమార్, సురేశ్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక సాహిత్యం విరివిగా రావాలి



శ్రీవేంకటేశ్వరునికి లక్షల అక్షర హారాలు-4 పుస్తకావిష్కరణలో కవులు, రచయితలు

మంచిర్యాలఅర్బన్: ఆధ్యాత్మిక సాహిత్యం విరివిగా రావాల్సిన అవసరం ఉందని ఏలూరు విశ్రాంత విద్యాధికారి డాక్టర్ టి.పార్థసారధి అన్నారు. మంచిర్యాలలో దేశభక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి సంపాదకత్వంలో రూపొందిన వెంకటేశ్వరునికి లక్షల అక్షర హారాలు-4 అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించి ప్రసంగించారు. పాఠకులలో భక్తి భావం పెంచేలా రచనలు చేయాలని కవులకు సూచించారు. కార్యక్రమంలో కవులు అల్లాడి శ్రీనివాస్, వామన్‌రావు, సత్యనారాయణ, సంతోష్, రాజిరెడ్డి, రవీందర్, సురేశ్, సుబ్బాయమ్మ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

'పెరిగిన వేతనాలు అమలు చేయాలి'

నస్పూర్: సింగరేణి సంస్థలో పని చేస్తున్న మహిళా కార్మికులందరికీ 11వ వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన వేతనాలు అమలు చేయాలని హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. జూన్‌లో పెరిగిన వేతనాలు కొంతమంది మహిళా కార్మికులకు మాత్రమే చెల్లించారని తెలిపారు. శిశు సంరక్షణ, మెటర్నిటీ సెలవులో ఉన్న మహిళా కార్మికులకు చెల్లించలేదని పేర్కొన్నారు. యాజమాన్యం వెంటనే స్పందించి మహిళా కార్మికులందరికీ పెరిగిన వేతనాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు.

సార్.. లెటర్ ప్లీజ్..!

- ఖద్దర్‌కు ఖాకీల సలాం
- ఆదాయం వచ్చే ఠాణాల్లో పోస్టింగ్‌కు పైరవీలు
- రూ.లక్షలు ఇచ్చి నచ్చిన స్టేషన్‌లో పోస్టింగ్





మంచిర్యాలక్రైం: పోలీస్ శాఖలో ఎన్నికల బదిలీల ప్రక్రియ మొదలైంది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న రెవెన్యూ, పోలీస్ ఉద్యోగులను బదిలీ చేసేందుకు ఆయాశాఖల అధికారులు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు డీజీపీ అంజన్‌కుమార్ ఎన్నికల నిర్వహణకు సిద్ధం కావాలని సీపీలు, ఎస్పీలను ఆదేశించారు. దీంతో బదిలీల ప్రక్రియ వేగవంతం చేశారు. రామగుండం పోలీస్ కమిషనర్‌తోపాటు రెండు జిల్లాల డీసీపీలు, ఏసీపీ, సీఐ స్థాయి అధికారులను బదిలీ చేశారు.

నచ్చిన పోస్టింగ్ కోసం పైరవీలు..
ఎన్నికల నేపథ్యంలో బదిలీలు సాధారణమే. కానీ ఇదే అదునుగా కొందరు సీఐలు, ఎస్సైలు నచ్చిన ఠాణాల్లో పోస్టింగ్ కోసం పైరవీలు మొదలు పెట్టారు. ఇందు కోసం ఖద్దర్ చొక్కాలు ధరించిన నేతల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖ కోసం పైసలు ఇచ్చేందుకు కూడా సిద్ధమవుతున్నారని తెలిసింది. మరోవైపు ప్రజాప్రతినిధులు సైతం తమకు అనుకూలమైన పోలీస్ అధికారులకు నియోజకవర్గాల్లోని స్టేషన్లలో పోస్టింగ్ ఇప్పించుకునేందుకు యత్నిస్తున్నారు. ముఖ్యంగా టాస్క్‌ఫోర్స్, ఎస్‌బీ, ఇంటలిజెన్స్ ఇతర విభాగాల్లో పని చేస్తున్న ఎస్సైలు మంచిర్యాల పోలీస్ స్టేషన్‌కు వచ్చేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మరికొంతమంది తమకు నచ్చిన ఠాణాలో పోస్టింగ్‌కోసం పోటీ పడుతున్నారు. ఇక పనిష్మెంట్ కింద అటాచ్ అయిన సీఐలు, ఎస్సైలు కూడా తిరిగి ఠాణాల్లో పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..
జిల్లాలో 26 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలో 12 మంది సీఐలు, 35 మంది ఎస్సైలు విధులు నిర్వహిస్తున్నారు. కొన్ని పోలీస్‌స్టేషన్లలో ముగ్గురు, మరికొన్ని స్టేషన్లలో ఇద్దరు ఎస్సైలు విధుల్లో ఉన్నారు. వీరిలో కొందరు ఏడాది క్రితం, మరి కొందరు ఆరు నెలల క్రితం వచ్చినవారే. లాంగ్ స్టాండింగ్ సీఐలు, ఎస్సైల బదిలీల నేపథ్యంలో వీరిని కూడా కదిలించక తప్పని పరిస్థితి నెలకొంది.

వద్దంటే ఆదాయం..
జిల్లాలో నేరాలు పెరుగుతున్నాయి. అక్రమ దందాలు జోరుగా సాగుతున్నాయి. సింగరేణి బొగ్గుగనులు, రైల్వేలైన్ ఉండడంతో గంజాయి దందా, పీడీఎస్ రైస్, స్క్రాప్ దందా యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఇక భూముల ధరలు పెరగడంతో రియల్ వ్యాపారం ఊపందుకుంది. అక్రమ రిజిస్ట్రేషన్లు పెరిగాయి. ఈ క్రమంలో నేరాలను నియంత్రించాల్సిన పోలీస్ శాఖకు అక్రమ దందాలు చేసేవారు వద్దన్నా ముడుపులు ముట్టజెబుతున్నారు. నెల వారీగా ఠాణాలకు వాటాలు పంపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇలా ఆదాయం వచ్చే ఠాణాల్లో పోస్టింగ్ కోసం ప్రజాప్రతినిధులకు ముడుపులు ఇచ్చేందుకు కూడా సీఐలు, ఎస్సైలు వెనుకాడడం లేదు. నేరుగా కాకుండా కిందిస్థాయి నేతల ద్వారా ప్రజాప్రతినిధులు కూడా ముడుపులు స్వీకరిస్తున్నారు.

కోల్‌బెల్ట్ ఏరియా ఠాణాలకు డిమాండ్..
జిల్లాలో కోల్‌బెల్ట్ ఏరియా పరిధిలో ఉన్న పోలీస్ స్టేషన్లలో పోస్టింగు కోసం చాలా మంది సీఐలు, ఎస్సైలు పోటీ పడుతున్నారు. మంచిర్యాల, బెల్లంపెల్లి, శ్రీరాంపూర్, చెన్నూర్, హాజీపూర్, జైపూర్, సీసీసీ నస్పూర్, మందమర్రి, రామకృష్ణాపూర్, మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ కోసం ఎమ్మెల్యేలు, ఎంపీల సిఫారసు లేఖ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం కిందిస్థాయి నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారు. కొందరు మంత్రులతో సిఫారసు లేఖ తెచ్చుకునే పనిలో ఉన్నారు. గత నెల 30న మంచిర్యాల పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు ఎస్సైలు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. ఈ నాలుగు పోస్టులకు కమిషనరేట్ పరిధిలోని రెండు జిల్లాలకు చెందిన ఎస్సైలు, సీఐలు పైరవీలు చేస్తున్నట్లు తెలిసింది.

ఎవరు ఎక్కువ ఇస్తే వారికే..
పోస్టింగ్‌ల కోసం ముడుపులు తీసుకుంటున్న నేతలు ఠాణాల వారీగా రేటు నిర్ణయించినట్లు తెలిసింది. నిర్ణయించిన రేటుకన్నా ఎవరు ఎక్కువ ఇస్తే వారికే పోస్టింగ్ ఇచ్చేలా లేఖ ఇస్తున్నట్లు సమాచాం. తక్కువ ఇచ్చిన వారి సొమ్ము తిరిగి వారికి అప్పగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. నేతల ఆశీస్సులు ఉన్నవారికే పోస్టింగులు వస్తుండడంతో నిజాయతీగా పనిచేసే అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రాధాన్యత లేని ఠాణాల్లో పనిచేయాల్సి వస్తుంది.

దుర్గమ్మా.. దీవించు

క్యారీ దుర్గాదేవి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం ఆవరణలో చండీహోమాన్ని నిర్వహించారు. భక్తులు అమ్మవారి దర్శనం అనంతరం పోచమ్మ, నాగదేవతలకు పూజలు చేశారు. తర్వాత అమ్మవార్లకు కోళ్లు, మేకలు బలిచ్చి అక్కడే వంట చేసుకుని భోజనాలు చేశారు. భక్తుల తాకిడితో క్యారీ వనం జనసంద్రంగా మారింది.
– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

– వివరాలు 8లో▸





'కొలిచిన వారికి కొంగు బంగారం'

మందమర్రిరూరల్: కోరి కొలిచిన వారికి కొంగు బంగారమవుతానని పట్టణంలోని బుర్దగూడెం సమీపంలోని మహంకాళి త్రిశక్తి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఏడుగురు అక్కాచెల్లెళ్ల అమ్మవార్ల జాతరలో రంగస్థలంలో శివశక్తి భవిష్యవాణి పలికారు. పాత సీఎస్పీ వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా, భారీ సంఖ్యలో మహిళలు, శివశక్తులు బోనాలతో తరలివచ్చారు. కోలాటాలు, పోతరాజుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.కాంగ్రెస్ నాయకులు రాజారమేష్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు మంతెన సతీష్‌భవానీ శాలువా కప్పి ఆయనను ఘనంగా సన్మానించారు.



బోనమెత్తుకున్న జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

డిగ్రీతోపాటు ఉపాధ్యాయ శిక్షణ!

- అందుబాటులోకి ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సు
- లక్సెట్టిపేటలో కళాశాలలో ఏర్పాటు
- నాలుగేళ్లలో డిగ్రీ, బీఈడీ పూర్తి చేసేలా రూపకల్పన




లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాల

లక్సెట్టిపేట: డిగ్రీతోపాటు ఇంటిగ్రేటెడ్ బీఈడీ కోర్సును పూర్తిచేసేలా ప్రభుత్వం డిగ్రీలో కొత్త కోర్సు ప్రవేశపెట్టింది. గతంలోని కోర్సులకు భిన్నంగా.. ఈవిధానంలో డిగ్రీతోపాటే బీఈడీ పూర్తి చేయవచ్చు. లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం కొత్త కోర్సు ప్రవేశపెట్టింది. ఇందుకు సమీకృత బీఈడీ కోర్సును బీఏ గ్రూపుతో ఆన్‌లైన్ అడ్మిషన్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈనెల 19వ తేదీలోపు విద్యార్థులు దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఈ కొత్త కోర్సులో చేరే విద్యార్థులు నాలుగేళ్లలో డిగ్రీతోపాటు బీఈడీ సర్టిఫికెట్ అందుకోవచ్చు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులవుతారు.

కళాశాలలో ఏర్పాట్లు..
తెలంగాణ రాష్ట్రంలో మూడు కళాశాలలకు నాలుగేళ్ల బీఈడీ కోర్సు నిర్వహించేందుకు అనుమతి లభించింది. అందులో లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాలకు స్థానం దక్కింది. ఇంటర్మీడియెట్ పూర్తిచేసి డిగ్రీ కోర్సుచేస్తూ ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ కోర్సు ఎంపిక చేసుకోవచ్చు. ఇందుకోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్ష నిర్వహిస్తుంది. దీనిద్వారా బీఈడీ కోర్సులో ప్రవేశం కల్పిస్తారు. ఈమేరకు లక్సెట్టిపేట మోడల్ డిగ్రీ కళాశాలలో నూతన కోర్సు బీఏ బీఈడీ కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. 50 మందికి ఈ కోర్సులో ప్రవేశం కల్పించనున్నారు.

సంతోషంగా ఉంది..



కళాశాలకు సమీకృత బీఈడీ కోర్సు రావడం సంతోషంగా ఉంది. ప్రభుత్వం లక్సెట్టిపేట కళాశాలను ఎంపిక చేయడం మంచి నిర్ణయం. నూతన కోర్సు కావడంతో విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఎంపిక పరీక్ష ద్వారా సీట్లు కేటాయిస్తారు. ఈనెల 19లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి.
– జైకిషన్‌ఓజా, ప్రిన్సిపాల్, లక్సెట్టిపేట డిగ్రీ కాలేజీ

'బోర్డు' లేని సంక్షేమం!

- సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి
- ఎవరికీ పట్టని మంచిర్యాల డిపో కార్మికుల సమస్యలు



నామ మాత్రంగా విశ్రాంత గదులు.. నిండిపోయిన బాక్స్‌లు

మంచిర్యాల అర్బన్: జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సంక్షేమ బోర్డు నామమాత్రంగా మారింది. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వెల్ఫేర్ బోర్డు సమావేశాలు జరిగిన దాఖలాలు లేవు. బోర్డు సభ్యులుగా ఉన్నా వారిలో ఒకరికి ప్రమోషన్ రాగా.. మహిళా కండక్టర్ రాజీనామా చేశారు. ఇక మీటింగ్ జరగక నెల రోజులు దాటిపోయింది. ఇంకోవైపు కార్మికుల సమస్యల కోసం ఏర్పాటు చేసిన ఫిర్యాదు బాక్స్‌లు కనిపించడం లేదు. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు పనిభారం మోపుతున్నా పట్టించుకునే వారు లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

2019లో సంక్షేమ బోర్డుల ఏర్పాటు..
మంచిర్యాల డిపోలో 142 బస్సులు ఉన్నాయి. ఇందులో 230 కండక్టర్లు, 180 డ్రైవర్లు పనిచేస్తున్నారు. ఆర్టీసీ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం 2019లో 52 రోజులు సమ్మె చేశారు. సమ్మెను తీవ్రంగా పరిగణించిన సీఎం కేసీఆర్ కార్మికులను తొలగించినంత పనిచేశారు. చివరకు కార్మికులే వెనక్కు తగ్గి ప్రభుత్వంతో చర్చలు జరిపారు. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ కార్మిక సంఘాలు ఉండవని ప్రకటించారు. ఆర్టీసీ కార్మికులకు బదులు అందరూ ఉద్యోగులే అని సీఎం ప్రకటించారు. వారి కోసం డిపోల వారీగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేశారు. కార్మిక సంఘాల స్థానంలో వెల్ఫేర్ బోర్డు అందుబాటులోకి తెచ్చారు. సిబ్బంది తమ సమస్యలను రాతపూర్వకంగా తెలిపేందుకు ఈ–బాక్సులు ఏర్పాటు చేశారు.

సంక్షేమ బోర్డులో ఇలా..
డిపో స్థాయి సంక్షేమ బోర్డులో ఒక మహిళా కండక్టర్, డ్రైవర్ సభ్యులుగా డిపో మేనేజర్ ముఖ్య అధికారిగా ఏర్పాటు చేశారు. ఈ ముగ్గురితోపాటు డిపోలోని గ్యారేజ్ ఇన్‌చార్జి, ట్రాఫిక్ ఇన్‌చార్జితో ప్రతీవారం సమావేశం కావాల్సి ఉంది. డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు ఈ–బాక్స్‌లో వేసిన సమస్యలపై చర్చించి పరిష్కారం చూపించాలి. డిపో పరిధిలో పరిష్కారం కాని సమస్యలు ఉన్నతాధికారులకు నివేదించాలి. నెలకొకసారి ఆర్‌ఎం అధ్యక్షతన జిల్లా స్థాయి బోర్డు మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి.

ఇవీ సమస్యలు..
మంచిర్యాల డిపో పరిధిలో కండక్టర్లు, డ్రైవర్ల సమస్యలు పెరుకుపోతున్నాయి. చిన్న చిన్న సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని దుస్థితి.

- స్పెషల్ ఆఫ్ డ్యూటీలు 360 కిలోమీటర్లు ఉండగా, ప్రస్తుతం 440 కిలోమీటర్లుకు పెంచటంపై కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- స్పెషల్ ఆఫ్ డ్యూటీలు 13 గంటలకు బదులుగా 16 గంటలు చేయటం, అనారోగ్య సమస్యలున్నా సిక్ లీవులు ఇవ్వకపోవటం..
- సిబ్బంది కొరత పేరిట అత్యవసరం ఉన్నా సెలవులు మంజూరు చేయకపోవటం..
- నాలుగేళ్లుగా మూడు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి.
- మహిళా కండక్టర్లకు 7 గంటలు దాటిన ఉద్యోగం చేయాల్సి వస్తోంది.
- ఓటీ డ్యూటీలు అధికంగా అమలు చేస్తున్నారు. దూర ప్రాంత కార్మికులు విశ్రాంతి తీసుకునే గదుల్లో సరిపడా బెడ్స్ లేవు.

ఏం జరుగుతుందంటే..
ఈ–బాక్సుల్లో వచ్చిన కార్మికుల విజ్ఞాపన పత్రాలపై మొదట్లో స్పందించేవారు. వారంలో ఒకసారి బాక్స్‌లు ఓపెన్ చేసేవారు. తర్వాత కాలంలో వెల్ఫేర్ బోర్డు మీటింగ్ నెలకోసారికి మార్చారు. ఈ–బాక్స్‌లు కనిపించకుండా పోయాయి. మంచిర్యాల డిపోలో వెల్ఫేర్‌బోర్డులో మెంబర్లుగా ఉన్నా ఓ ఉద్యోగికి ప్రమోషన్ రావటం.. మహిళా కండక్టర్ రాజీనామా చేయటంతో సమస్య మొదటికి వచ్చింది. సమావేశాలు మాటలా ఉన్నా సమస్యలపై నోరు మెదపని పరిస్థితి నెలకొంది.

సభ్యుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాల డిపో పరిధిలో సంక్షేమ బోర్డు సభ్యులుగా ఉన్న ఒకరికి ప్రమోషన్ వచ్చింది. మరో సభ్యురాలు రాజీనామా చేశారు. దీంతో సమావేశాల నిర్వహణలో కొంత జాప్యం జరిగింది. కార్మికుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటున్నాం. సంక్షేమ బోర్డు సభ్యుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హతలను బట్టి నూతన సభ్యులను నియమించి బోర్డు మీటింగ్ నిర్వహిస్తాం.
– రవీంద్రనాథ్, ఆర్టీసీ డీఎం, మంచిర్యాల

పశువైద్యశాలల మరమ్మతుకు వినతి

భీమారం: రాష్ట్రంలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలలకు మరమ్మతులు చేయించాలని గొర్రెలు, మేకల పెంపకందారులసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్‌యాదవ్ కోరారు. ఈమేరకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఆదివారం వినతిపత్రం ఇచ్చారు. హైదరాబాద్‌లో ఆదివారం మంత్రిని కలిసి రాష్ట్రంలో అనేక భవనాలు శిథిలావస్థకు చేరాయని తెలిపారు. ప్రమాదకర భవనాల్లో వైద్యులు సేవలు అందించేందుకు భయపడుతున్నారని పేర్కొన్నారు. కొన్ని మండలాల్లో అద్దె భవనాల్లో ఆసుపత్రులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వాటిని గుర్తించి సొంత భవనాలు నిర్మించాలని కోరారు. వర్షాకాలం ప్రారంభం అయినందున గొర్రెలు, మేకలకు టీకాలు వేయించాలని విన్నవించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చినట్లు అశోక్ యాదవ్ తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో పగల శంకర్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.



మంత్రి శ్రీనివాస్‌యాదవ్‌కు వినతిపత్రం ఇస్తున్న అశోక్‌యాదవ్, నాయకులు

'సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం'

జన్నారం: సమస్యల పరిష్కారంలో అధికార పార్టీ ఎమ్మెల్యేతోపాటు అధికారులు విఫలమయ్యారని ఏఐసీసీ రిసెర్చ్ డిపార్టుమెంట్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్‌నాయక్ ఆరోపించారు. జన్నారం మండలం మొర్రిగూడ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఆదివారం పర్యటించారు. కాలనీ వాసులు గ్రామ సమస్యలను వినోద్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. బీఆర్ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో గ్రామీణ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని ఆరోపించారు. డ్రైనేజీలు లేవని, రోడ్డు సౌకర్యం లేదని పేర్కొన్నారు.

చకచకా లింక్ రోడ్డు నిర్మాణం

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో ఏర్పాటు చేయనున్న స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్‌జోన్ పరిధిలో రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఫుడ్ ప్రాసెస్‌జోన్ అంతర్భాగంలో బీటీ రోడ్ల నిర్మాణ పనులు తుది దశకు వచ్చాయి. డబుల్ రోడ్లు నిర్మిస్తున్నారు. ఆ రోడ్లకు అనుసంధానంగా లింక్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఆనుకుని ఉన్న మున్సిపల్ డంప్ యార్డు నుంచి కొత్త బస్టాండ్ ఏరియా, మధునన్న నగర్ మధ్యలో లింక్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మట్టి పనులు ఇప్పటికే పూర్తి చేసి బీటీ పనులు జరుగుతున్నాయి. మున్సిపల్ డంప్ యార్డు నుంచి కొత్తబస్టాండ్ చౌరస్తా(కల్వర్టు)వద్ద అనుసంధానం చేయనున్నారు. ఈ రోడ్డు రాకపోకలు సునాయాసమవుతాయి.



నిర్మాణంలో ఉన్న లింక్ రోడ్డు

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో జీపీ వర్కర్ మృతి


మల్లేశ్ (ఫైల్)

దండేపల్లి: మండలంలోని కొర్విచెల్మ గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ గంగాధరి మల్లేశ్ (49) విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. జీపీ మల్టీపర్పస్ వర్కర్ విధుల్లో భాగంగా మల్లేష్ పంపు ఆపరేటర్‌గా, స్ట్రీట్‌లైట్ల బిగింపు పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం విద్యుత్ స్తంభం ఎక్కాడు. ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతి చెంది స్తంభం పైనుంచి కిందపడిపోయాడు. కాగా అతడు విద్యుత్ స్తంభానికి స్ట్రీట్‌లైట్ బిగించేందుకు ఎక్కాడా? లేదా ఏదైన మరమ్మతు కోసం ఎక్కాడా? అనేది మాత్రం తెలియడం లేదు. ఘటన స్థలాన్ని లక్సెట్టిపేట సీఐ కృష్ణారెడ్డి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు. మృతుడికి భార్య వెంకటవ్వ, కుమారులు రాజు, శ్రీనివాస్ ఉన్నారు.

'మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం'


సమస్యలు తెలుసుకుంటున్న రఘునాథ్

పాతమంచిర్యాల: మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. జిల్లా కేంద్రంలోని చున్నంబట్టివాడ, శ్రీకృష్ణ కాలనీలో గడపగడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా వీధులలో పర్యటించి ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీరాలంటే ఎమ్మెల్యే మారాలని, లక్షల రూపాయలు వెచ్చించి ఇండ్లు నిర్మాణం చేసుకుని వేల రూపాయలు పన్నులు కడుతున్న ప్రజలకు కనీస వసతులు ప్రభుత్వం కల్పించకపోవడం దారుణమన్నారు. డ్రైనేజీలు, రోడ్లు, మంచినీటి వసతి వార్డుల్లో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ, అసెంబ్లీ కన్వీనర్ మల్లిఖార్జున్, పూదరి రమేష్, ముదాం మల్లేష్, హరికృష్ణ, జాడి సత్యనారాయణ, రాకేష్ రేణ్వా, అశోక్, చక్రి, పోలింగ్ బూత్ అధ్యక్షుడు తాజ్‌ఖాన్, రాకేష్ పాల్గొన్నారు.

ఉల్లాసంగా..ఉత్సాహంగా


బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కడెం: వీకెండ్ సెలవులు రావడంతో ఆదివారం కడెంలో పర్యాటకులు సందడి చేశారు. ప్రాజెక్ట్ పరిసరా ప్రాంత అందాలను తిలకించారు. బోటు షికారు చేస్తూ ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు.

డాక్టర్ తీరు మారలే..?

నేరడిగొండ: విధులు సక్రమంగా చేపట్టకుండా ఇది వరకే ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్న మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఓ డాక్టర్ తీరు ఇంకా మారలేదు. గత బుధవారం పీహెచ్‌సీకి చెందిన ఓ స్టాఫ్‌నర్సు జిల్లా వైద్యాధికారికి ఆయనపై ఫిర్యా దు చేసినట్టు తెలుస్తోంది. అయితే సదరు డాక్టర్ ఆమెపై దురుసుగా ప్రవర్తించినందుకే ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి ఆమెకు తెలిపినట్లు సమాచారం. కాగా సదరు వైద్యుడు విధులకు దుమ్మా కొట్టినప్పటికీ రిజిస్టర్‌లో మాత్రం హాజరు వేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏదైన పని నిమిత్తం సెలవు అడిగితే మంజూరు చేయడం లేదని సిబ్బంది పేర్కొంటున్నారు. ఇలాంటి సంఘటలు పునరావృతం కాకుండా చూడాలని ఉన్నతాధికారులను వైద్య సిబ్బంది, మండల ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురిపై డ్రంకెన్‌డ్రైవ్ కేసు

కుంటాల: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై హన్మండ్లు తెలిపారు. మండలంలోని కుంటాల–అంబకంటి రోడ్డు మార్గంలో ఎస్సై ఆధ్వర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేశారు. వాహనదారులకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించగా, ముగ్గురు మద్యం తాగినట్లు రుజువైంది.

దుర్గమ్మా.. దీవించు

- ఘనంగా క్వారీ జాతర
- పోటెత్తిన భక్తజనం...
- అమ్మవారిని దర్శించుకున్న నేతలు


పోచమ్మతల్లి ఆలయంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు దంపతులు, నాయకులు


క్వారీ దుర్గాదేవి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


బోనాలతో మహిళలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): క్వారీ దుర్గాదేవి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం దుర్గాదేవి ఆలయ ఆవరణలో చండీహోమాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజల అనంతరం అక్కడే సహపంక్తి భోజనాలు చేశారు. దుర్గామాత దర్శనం అనంతరం పోచమ్మ, నాగదేవతలకు పూజలు చేశారు. భక్తుల తాకిడితో క్వారీ వనం జనసంద్రంగా మారింది.

పెద్ద సంఖ్యలో ప్రముఖుల రాక...

క్వారీ దుర్గాదేవి జాతరకు భక్తులతో పాటు పలువురు ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు–రాజకుమారి దంపతులతో పాటు మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, వైస్ చైర్మన్ ముఖేశ్‌గౌడ్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వి.ప్రతాప్, మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేశ్‌లు దుర్గాదేవి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్‌కేకన్ కుటుంబ సభ్యులు, ఏసీపీ ఎడ్ల మహేశ్ తదితర ప్రముఖులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. గఢ్‌పూర్ సర్పంచ్ ఏదుల లక్ష్మి–భూమన్న, కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

ఉదయం నుంచే పెరిగిన భక్తుల తాకిడి...

ఆదివారం క్వారీ దుర్గాదేవి జాతరకు ఉదయం నుంచే భక్తుల తాకిడి పెరిగింది. అయితే క్వారీ జాతరలో ఉదయం 5గంటల నుంచి భక్తులు క్వారీ జాతరకు తరలి వస్తుండడంతో మధ్యాహ్నం వరకు భారీ సంఖ్యలో తరలివచారు. మధ్యాహ్నం వరకు భక్తుల రాక అధికం కావడంతో ఆలయం, పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆర్టీసీ బస్సుల నిలిపివేత..

క్వారీ దుర్గాదేవి జాతరకు ఆర్టీసీ బస్సులు వేసింది. అయితే పోలీసులు క్వారీ గుట్టపైకి అనుమతి ఇవ్వకపోవడంతో ఆర్టీసీ బస్సులు నిలిపివేసింది. దీంతో భక్తులు జాతరకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. అలాగే భారీ వాహనాలు కూడా గుట్టపైకి అనుమతి ఇవ్వకపోవడంతో కొంత మేర ట్రాఫిక్ సమస్యలు తీరాయి.

భారీగా పోలీస్ బందోబస్తు...


పోలీసుల భారీ బందోబస్తు

మంచిర్యాల డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆధ్వర్యంలో మంచిర్యాల పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మంచిర్యాల సీఐ రాజు, రూరల్ సీఐ తోట సంజీవ్‌లతో పాటు పలువురు సీఐలు, ఎస్సైలతో పాలు పెద్ద ఎత్తున పోలీస్ సిబ్బంది క్వారీ జాతర బందోబస్తులో భాగస్వామ్యమయ్యారు. జాతరలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు, ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టారు.


భక్తులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు


నాగదేవత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


దుకాణాల్లో భక్తుల కొనుగోళ్లు


జాతరలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

32 ఏళ్ల తరువాత కలుసుకున్నారు...


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాల (తెలుగు మీడియం) విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సరిగ్గా 32ఏళ్ల క్రితం ఒకే పాఠశాలలో కలిసి పదో తరగతి వరకు చదువుతున్న పూర్వ విద్యార్థులు ఒకేచోట చేరి ఆత్మీయతను పంచుకున్నారు. ఆదివారం తాపీ సంఘం భవనంలో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి హాజరయ్యారు. సుదూరప్రాంతాల్లో నివాసం ఉంటున్న చిన్ననాటి స్నేహితులు మూడు దశాబ్దాల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తోటి స్నేహితుల మృతికి సంతాపం తెలిపారు. అనంతరం గురువులకు పూల మాలవేసి శాలువతో సన్మానించారు.

ఆత్మీయ కలయిక..


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

జన్నారం: మండలంలోని ఇందన్‌పల్లి 2003–04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. విద్యార్థులు కలిసి అప్పటి ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాల్లో పనిచేస్తున్న వారు ఒకరితో ఒకరు తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గౌతం, దామోదర్, అనిల్, రమేశ్, మహేశ్, శ్రీనివాస్, కరుణ, కల్పన, రాజ్యలక్ష్మి, స్వప్న, విద్య పాల్గొన్నారు.

రైల్వే పైవంతెనకు మరమ్మతులు


మూసివేసిన పైవంతెన...

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలోని రైల్వే పై వంతెనకు మరమ్మతులు జరుగుతున్నాయి. గడిచిన కొద్ది రోజుల నుంచి వంతెనను మూసి వేసి పనులను నిర్వహిస్తున్నారు. వంతెన మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మరమ్మతుల కారణంగా రెండో నెంబర్ ప్లాట్ ఫామ్ నుంచి రైల్వే కాలనీకి వెళ్లే మార్గాన్ని మూసి ఉంచారు. ప్రత్యేకంగా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ప్రయాణికులు, రైల్వేకాలనీ వాసులు ఆ మార్గం మీదుగా రాకపోకలు సాగించకుండా నిలువరించారు. ఈ కారణంగా రైల్వే కాలనీ వాసులు, రైల్వే ఉద్యోగులు కాల్‌టెక్స్ ఏరియా మీదుగా రైల్వేస్టేషన్‌కు వచ్చి వెళ్తున్నారు. ఉద్యోగులు విధులకు హాజరవుతున్నారు. సత్వరంగా పైవంతెన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని రైల్వే కాలనీవాసులు, రైల్వే ఉద్యోగులు కోరుతున్నారు.

మేమున్నాం..

- అభయమిస్తున్న మెంటల్ హెల్త్ క్లినిక్
- జిల్లా ఆస్పత్రిలో రెండు నెలల క్రితం ఏర్పాటు
- విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా అవగాహన
- దురలవాట్లు, మానసిక సమస్యలకు చికిత్స
- 14416 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సలహాలు, సూచనలు



మానసిక, డిప్రెషన్ సమస్యల కోసం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబరు


అవగాహన కల్పిస్తున్న సైక్రియాటిస్టు సునిల్‌కుమార్(ఫైల్)

మంచిర్యాలటౌన్: మానసిక సమస్యలు, నిద్రలేమి, మత్తు పదార్థాలకు, పొగాకుకు బానిసలుగా మారిన వారితో పాటు, ఆత్మహత్యకు ప్రయత్నించిన వారు, పరీక్షల్లో మార్కులు తక్కువగా వచ్చాయని ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనలు వచ్చే వారికి సైక్రియాటిస్టు ద్వారా కౌన్సెలింగ్ ఇచ్చి వారిలోని సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని జిల్లా ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన మెంటల్ హెల్త్ క్లినిక్‌లు అభయాన్ని ఇస్తున్నాయి. అన్ని జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రుల్లో వీటిని ఈ ఏడాది మే 4వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కలెక్టర్ బదావత్ సంతోశ్, ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ప్రారంభించారు. రెండు నెలల్లోనే ప్రతిరోజు పదికి పైగా మానసిక ఆరోగ్య క్లినిక్‌లకు వస్తున్నారు. ఎక్కువగా ఆత్మహత్య చేసుకోవాలని అనుకునే వారు, ఆయా ప్రయత్నాలు చేసిన వారే అధికం. ఒక సైక్రియాటిస్టును నియమించి సమస్యలతో వచ్చిన వారికి కౌన్సెలింగ్‌ను ఇవ్వడంతో పాటు అవసరమైన వారికి మందులను, తప్పనిసరిగా ఆస్పత్రిలో చేర్చుకోవాల్సిన వారిని ఇన్‌పేషెంట్‌గా అడ్మిట్ చేసుకుని వైద్య సేవలను సైతం అందిస్తున్నారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు ఓపీ సమయంలో ఈ క్లినిక్‌లను తెరిచి ఉంచుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన వారికి ఉన్న సమస్యలకు తగిన సలహాలు, సూచనలు, అవసరమైన చికిత్సను తీసుకునేందుకు ఇబ్బందులు పడుతున్న వారి కోసం టెలిమానస్ టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సైతం ఏర్పాటు చేసి ఎప్పుడైనా ఈ నంబర్‌కు ఫోన్ చేసి, అవసరమైన సలహాలను పొందేందుకు అవకాశం కల్పిస్తున్నారు.

మానసిక సమస్యలే ఎక్కువ...

ప్రస్తుత కాలంలో పలువురు పలు రకాల మానసిక రుగ్మతలకు గురవుతున్నారు. చాలా మంది ఆత్మనూన్యతాభావానికి గురవుతూ ఏకాగ్రత లోపం, లేనివి ఉన్నట్లుగా భ్రమపడటం, స్వీయ నియంత్రణ లేకపోవడం, తనతో తాను మాట్లాడుకోవడం, నిందించుకోవడం, గాభారా పడి ఆందోళన, భయం, గుండె దడతో పాటు, సెక్స్ సంబంధిత సమస్యలు, మానసిక కుంగుబాటు, మేనియా (బైపోలార్ డిజార్డర్) అంటే అతిగా మాట్లాడడం వంటి సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. తనలో తాను మాట్లాడుకోవడం, ఇతరులతో మాట్లాడుతున్న సమయాల్లో నవ్వుతూనే ఒక్కసారిగా కోపాన్ని ప్రదర్శించడం, ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం, మద్యపానం, దూమపానం, పొగాకు, మత్తు పదార్థాలకు బానిసలుగా మారిన వారికి ఈ మానసిక ఆరోగ్య క్లినిక్‌లో సైక్రియాటిస్టు ద్వారా వైద్య సేవలు అందిస్తున్నారు. జిల్లా ప్రజలు ఇప్పుడిప్పుడే ఈ క్లినిక్ ద్వారా వైద్య సేవలను అందుకుంటుండగా ఆస్పత్రికి వచ్చేందుకు ఇబ్బందిగా అనుకునే వారి కోసమే ప్రత్యేకంగా టెలీమానస్ 14416 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులోకి తెచ్చారు.

సమస్యలున్న వారు వస్తున్నారు...



మానసిక అనారోగ్యానికి సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలను అందించేందుకు మానసిక ఆరోగ్య క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు పది మందికి పైగా పలువురు సమస్యలతో బాధపడుతున్నవారు వచ్చి చికిత్స తీసుకుంటున్నారు. ఆస్పత్రి వరకు రాలేని వారి కోసం టెలీమానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416లో సంప్రదించి అనుమానాలు, చికిత్స విధానం, ఇతరాత్ర వాటిపై అడిగి తెలుసుకునేందుకు అవకాశం ఉంది. అధికంగా స్మార్ట్ ఫోన్‌ను వాడే చిన్నారులకు సైతం ఈ క్లినిక్ ఉపయోగపడుతున్నాయి.

– సునీల్‌కుమార్, సైక్రియాటిస్టు

కాంగ్రెస్‌లో చేరికలు

పాతమంచిర్యాల: మంచిర్యాల మున్సిపాలిటీలోని 25వ వార్డుకు చెందిన వివిధ పార్టీల నాయకులు 150 మంది ఆదివారం మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలు నచ్చక వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. దేశంలో, రాష్ట్రంలో సుపరిపాలన కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని వివరించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యులు కొండా చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కౌన్సిలర్ రామగిరి బానేష్, పట్టణ ఉపాధ్యక్షులు జోగుల సదానందం, మైనార్టీ నాయకులు ఇర్ఫాన్ పాల్గొన్నారు.


పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు

బైక్ చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బస్టాండ్ ప్రాంతం నుంచి బైక్ చోరీకి గురైనట్లు టూ టౌన్ ఎస్సై ఊశన్న తెలిపారు. ఆయన కథ నం ప్రకారం.. ఈనెల 2న జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో హోంగార్డు ఆకుల వెంకటరమణ బైక్‌ను పార్క్‌చేసి తన స్నేహితుడిని బస్సు ఎక్కించాడు. తిరిగి వచ్చి చూసేసరికి తన బైక్ కనిపించలేదు. చుట్టుపక్కలా వెతికినా దొరకలేదు. ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ఒకరి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో కూలీగా పనిచేస్తున్న చింతల కపిల్ (35) మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి ఇంటికి వస్తుండేవాడు. దీంతో భార్య కృష్ణవేణి మందలించింది. శనివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన కపిల్ కేఆర్‌కే కాలనీలో పురుగుల మందు తాగి మృతిచెందిన విషయం ఆదివారం కుటుంబీకులకు తెలిసింది. భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వాడబలిజల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- వాడబలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు బోడెంకి మహేశ్
- గంగాదేవికి ప్రత్యేక పూజలు చేసిన నాయకులు


పూజలు చేస్తున్న వాడబలిజ సంఘం నాయకులు

పాతమంచిర్యాల: వాడబలిజల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బోడెంకి మహేష్ మహేష్ అన్నారు. జిల్లాలోని పాత మంచిర్యాల శివారులోని గంగాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. వాడబలిజలు అనాధిగా పడవలు నడుపుతూ, చేపలవేట కొనసాగిస్తూ నదీతీర ప్రాంతాలలో నివాసం ఉంటూ కాలం గడుపుతున్నారన్నారు. వాడ బలిజలను సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మత్స్యశాఖ సొసైటీలలో వాడ బలిజలకు ప్రత్యేకస్థానం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మండల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మంచిర్యాల మండల వాడబలిజ సంఘం మండల అధ్యక్షుడిగా గగ్గూరి సత్తయ్య, కార్యదర్శిగా బోడెంకి కుమార్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వాడ బలిజ సంఘం నాయకులు గగ్గూరి రాజన్న, గారే శంకర్, బొల్లె ల్లే శ్రీనివాస్, సత్తన్న, దేవేందర్, సంజయ్, నగేష్, రాజన్న, మనోజ్ నాగమణి, వరుణ్, కృష్ణ, పరశురాం, మధునయ్య, రమేష్ పాల్గొన్నారు.